క్లుప్తంగా

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

నగరి: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘననివాళి అర్పించారు. రాష్ట్ర వర్కింగ్ కమిటీ మాజీ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నగరి బస్టాండ్ వద్ద రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి, పూజలు చేసి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. అనంతరం శ్రీ పెరంబుదూర్ వెళ్లి రాజీవ్ గాంధీ స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు.

మామిడి దిగుబడి అంచనాలు సిద్ధం చేయాలి



ఆర్‌ఎస్‌కే సిబ్బందితో సమీక్షిస్తున్న హెచ్‌ఓ సాగరిక

బంగారుపాళెం: మండలంలో మామిడి దిగుబడిపై అంచనాలు సిద్ధం చేయాలని మండల ఉద్యానశాఖ అధికారి సాగరిక అన్నారు. మండలకేంద్రంలో బుధవారం రైతు సేవాకేంద్రం సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, మండలంలోని గ్రామాల్లో 2025వ సంవత్సరానికి సంబంధించి రైతుల తోటల్లో పండిన మామిడి పంట దిగుబడి అంచనా సిద్ధం చేయాలని సూచించారు. తోటల్లో ఏఏ రకం మామిడి దిగుబడి వచ్చింది. ఎన్ని టన్నులు వచ్చింది. అందులో బెంగళూరు రకం మామిడి ఎన్ని టన్నులు వస్తుందనే అంచనాలను తయారు చేసి అందించాలన్నారు. ఈ సీజన్‌లో బెంగళూరు రకం మామిడి ఫ్యాక్టరీలకు ఏమేరకు సరఫరా చేయవచ్చు అని తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. అందుకు తగ్గట్టుగా రైతులు పంట కోత చేసుకునేందుకు వీలుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చిట్టిబాబు, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ నిమజ్జనం

గంగాధరనెల్లూరు: మండలంలోని తూగుండ్రం గ్రామంలో కులమతాలకు అతీతంగా గంగమ్మ నిమజ్జనం బుధవారం వైభవంగా జరిగింది. తూగుండ్రం గ్రామంలో నడివీధి గంగమ్మకు కులమతాలకు అతీతంగా ముస్లింలు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. గంగమ్మ నిమజ్జనం కార్యక్రమంలో పంచాయతీలోనే కాకుండా తమిళనాడు, కర్ణాటక పక్క పంచాయతీలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి అమ్మవారు ఊరేగింపుగా వెళ్లి డప్పులతో కోలాటాలతో సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ధర్మకర్త రామస్వామి శేఖర్ మొదలి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీఆర్‌ఓలను మినహాయించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఆర్‌ఓలు

తవణంపల్లె: జీఓ నంబరు–4 గ్రామ రెవెన్యూ అధికారులను పలు ఇబ్బందులకు గురిచేస్తుందని వీఆర్‌ఓల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. తహసీల్దార్ సుధాకర్‌కు బుధవారం వీఆర్‌ఓలు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. వీఆర్‌ఓలు పని ఒత్తిడితో అనారోగ్యానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. క్లస్టర్ విధానంతో వీఆర్‌ఓలను మిగులు సిబ్బందిగా చూపించి వారిని ఇతర శాఖల్లో విలీనం చేయాలనుకోవడం దారుణమన్నారు. జీఓ నంబరు 4 నుంచి వీఆర్‌ఓలకు మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తక్షణం వీఆర్‌ఓల విషయంలో తీసుకున్న నిర్ణయాన్ని పునరాలోచించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఓల సంఘం జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ ఆధ్వర్యంలో వీఆర్‌ఓలు చంద్ర, సురేష్, ప్రకాష్, కృపానందం, ప్రకాశం తదితరులు వినతిపత్రం అందజేశారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో శ్రీవారి సర్వదర్శనానికి 18 గంటలు పడుతోంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 76,000 మంది స్వామివారిని దర్శించుకోగా 31,766 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.07 కోట్లు సమర్పించారు.

రంగు పడుద్ది

ప్రతి మనిషి సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా ఉండాలంటే పండ్లు తినాలి. డాక్టర్ల వద్దకు వెళితే తరచుగా చెప్పే మాట ఇది. ప్రస్తుతం రంగు చూసి మురిసిపోయి పండ్లు తింటే అనారోగ్యం మాత్రం ఖాయం. మామిడి, అరటి పండ్లను త్వరగా పక్వానికి తెచ్చేందుకు కొందరు బడా వ్యాపారులు కృత్రిమంగా మగ్గబెడుతున్నారు. లాభార్జనే ధ్యేయంగా పక్వానికి రాని పండ్లను కోస్తున్నారు. రంగు మార్చేందుకు విషపూరితమైన రసాయనాలు వాడుతున్నారు. దీంతో ఆ పండ్లు ఆకర్షణీయ రంగుల్లో మెరిసిపోతున్నాయి. వీటిని చూసి మురిసిపోయిన వినియోగదారులు కొని తింటున్నారు. అనారోగ్యానికి గురవుతున్నారు.



కృత్రిమ పద్ధతిలో మాగబెట్టిన మామిడి పండ్లు

- కృత్రిమంగా మాగబెడుతున్న వైనం
- మామిడి పండ్ల పక్వం కోసం కార్బైడ్
- ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

విజయపురం: నగరి నియోజకవర్గ పరిధిలో పండ్ల వ్యాపారులు అధికంగా ఉన్నారు. మామిడి సీజన్ కావడంతో నగరి, పుత్తూరు ప్రాంతాల్లో విచ్చలవిడిగా పండ్ల దుకాణాలు పుట్టుకొచ్చాయి. హోల్‌సేల్ వ్యాపారులతో పాటు రోడ్డు పక్కన వందల సంఖ్యలో పండ్ల దుకాణాలు వెలిశాయి. అలాగే వడమాలపేట టోల్‌గేట్ వద్ద రోడ్డుకు ఇరువైపులా మామిడి పండ్ల దుకాణాలు లెక్కలేనన్ని ఏర్పాటు చేశారు. తిరుపతి నుంచి చెన్నై వెళ్లే యాత్రీకులను ఆకర్షించే రీతిలో పండ్ల దుకాణాలు వెలిశాయి.

సంప్రదాయ విధానాలకు పాతర

గతంలో పండ్లను మగ్గబెట్టేందుకు సంప్రదాయ విధానాలు, సహజ పద్ధతులను ఉపయోగించేవారు. అరటి, మామిడి కాయలను గడ్డిలో వేసి మగ్గబెట్టి ఊదర పెట్టేవారు. కాయలను చెట్ల మీద ముదిరి పక్వానికి వచ్చిన తర్వాత కోసి సాంబ్రాణి పొగ, పీచు పొగతో సహజంగా మగ్గించే వారు. దీంతో పండు రుచి అమోఘంగానూ ఆరోగ్యకరంగానూ ఉండేది. ఇప్పుడు కొందరు వ్యాపారులు పండ్లను కొనుగోలు చేసిన రోజే మగ్గబెట్టి విక్రయానికి పెడుతున్నారు. బడా వ్యాపారులు పెద్ద ఎత్తున పండ్ల తోటలను కొనుగోలు చేస్తున్నారు. రసాయనాలను ఎక్కువగా వినియోగించి పండలను మగ్గబెడుతున్నారు. అన్నీ తెలిసి అధికారులు మౌనంగా ఉన్నారు. తద్వారా ప్రజల ఆరోగ్యానికి ముప్పు తప్పదని వినియోగదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

కృత్రిమంగా మాగబెడుతున్నారు

విజయపురం, నగరి, పుత్తూరు, వడమాలపేట మండలంలో అత్యధికంగా మామిడి సాగు ఉంది. స్థానికంగా పండే పండ్లతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పండ్లను రవాణా చేసుకుంటారు. వ్యాపారులు రవాణా చేసుకున్న పండ్లను కొన్ని గోదాముల్లో గోప్యంగా మాగపెట్టేందుకు కార్బైడ్‌ను వినియోగిస్తున్నారు. చెట్లకు పచ్చికాయలనే కోసి కేవలం గంటల వ్యవధిలోనే రంగు మార్చేస్తున్నారు. ఈ వ్యవహారం యథేచ్ఛగా సాగుతున్నా ఫుడ్ సేఫ్టీ అధికారులు, మార్కెటింగ్ శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.



మాగబెట్టేందుకు గోదాములో సిద్ధంగా ఉన్న అరటి కాయలు

విధిలేని పరిస్థితి



ఆరోగ్య కరమైన తాజాపండ్లు ఇప్పుడు మార్కెట్‌లో దొరకడం లేదు. పండ్లను విషపూరిత రసాయనాలతో మగ్గబెడుతున్నారని తెలుసు. కానీ విధిలేని పరిస్థితిలో తీసుకోవల్సి వస్తుంది. ఇలాంటి పండ్లు మార్కెట్లోకి రాకుండా అధికారులు ముందస్తుగా చర్యలు తీసుకోవాలి. అప్పుడే పండ్లను సంతోషంగా కొని తినగలం.

–కన్నన్, విజయపురం

అధికారులు స్పందించాలి



ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పందించి, గోదాములో పండ్లను మగ్గపెడుతున్న వాటిని గుర్తించి చర్యలు తీసుకోవాలి. వ్యాపారులకు అవగాహన కల్పించాలి. అదే సమయంలో వినియోగదారులకు వీటి గురించి వివరించాలి. రసాయనాలతో కృత్రిమంగా మగ్గబెట్టిన పండ్లను గుర్తించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలి.

–దాసు, పరమేశ్వరమంగళం

ఆరోగ్యంపై ప్రభావం



సహజ సిద్ధంగా పండిన పండ్లు తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది. కానీ కార్బైడ్ రసాయనాలతో మగ్గపెట్టిన పండ్లను తింటే ఆరోగ్యం పాడవుతుంది. దీని వల్ల ప్రధానంగా జీర్ణకోశ వ్యాధులు రావడంతో పాటు, నాడీ వ్యవస్థ దెబ్బతింటాయి. దీనిపై వినియోగదారులు, అధికారులు, వ్యాపారులు అవగాహన కలిగి ఉండాలి.

–డాక్టర్ విష్ణుప్రియ, విజయపురం

గంగమ్మా.. చల్లగా చూడమ్మా!



చౌటూరు గంగమ్మ జాతరలో మాజీ మంత్రి రోజా

పుత్తూరు: గ్రామ దేవత గంగమ్మ జాతర వైభవంగా సాగింది. పుత్తూరు మండలం తొరూరు, చౌటూరు, గొల్లపల్లి, నేసనూరు గ్రామాల్లో బుధవారం గంగ జాతర వైభవంగా నిర్వహించారు. అన్ని జాతరల్లో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అన్ని చోట్ల గంగమ్మకు సారెను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా జాతర కమిటీల వారు ఆమెకు ఘన స్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు ఏకాంబరం, రూరల్ మండలం పార్టీ అధ్యక్షుడు అన్నాలోకనాథం, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులురెడ్డి, వెంకటేశులురెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివలింగం, దిలీప్, మోహన్‌రెడ్డి, దేవేంద్రరెడ్డి, జయకుమార్, మురళి, కిషోర్, గోవిందస్వామిరెడ్డి, మురళీయాదవ్, చక్రి, విరిత, రాంబత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

గంగజాతరలో మాజీ మంత్రి ఆర్కే రోజా

వడమాలపేట (విజయపురం): వడమాలపేట పట్టణం, టీసీ అగ్రహారంలో బుధవారం జరిగిన గంగ జాతరలో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆమె వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





తొరూరు గంగమ్మ సేవలో మాజీ మంత్రి రోజా, వడమాలపేట, టీసీ అగ్రహారంలో గంగమ్మను దర్శించుకుంటున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



ప్రకృతి సాగులో భాగంగా కూరగాయల సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాలసముద్రం: ప్రస్తుతం మనుషుల జీవన శైలి మారిందని, ఆహార అలవాట్లు మారాయని.. మనం తీసుకునే ఆహారం అంతా రసాయన ఎరువులు, పురుగు మందులతో సాగు చేయడంతో వ్యాధులు కారకంగా మారుతోందని.. ఈ నేపథ్యంలో రైతులు ప్రకృతి వ్యవసాయసాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని ఏఎంఎంటీ గంగరత్న, డీఎంఎంటీ ధనలక్ష్మి తెలిపారు. బుధవారం వారు శ్రీకావేరిరాజుపురం ఆదిఆంధ్రవాడ సమీపంలో ప్రకృతి వ్యవసాయసాగులో భాగంగా (ఏటీఎం) వెజిటబుల్ మోడల్ సాగుపై ఎంటీ ప్రతాప్ ఆధ్వర్యంలో మహిళా రైతులకు అవగాహన కల్పించారు. ఏఎంఎంటీ గంగరత్న మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విభాగం లక్ష్యం క్రమేపీ రసాయన ఎరువులు, పురుగు మందుల వివియోగం తగ్గించాలన్నారు. ఘన, ద్రవ, కషాయాల ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేస్తున్న మహిళలు పుష్ప, నిర్మల, మునియమ్మ పాల్గొన్నారు.

ముగిసిన కొలుపు మహోత్సవం

పాలసముద్రం: మండలంలోని వెంగళరాజుకుప్పం పంచాయతీ కన్నికాపురంలో వెలసిన బాటగంగమ్మ కొలుపు బుధవారం కోలాహలంగా ముగిసింది. ఉదయం అర్చకులు అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి పాలు, పెరుగు, చందనం, నెయ్యి, తేనెతో అభిషేకాలు చేపట్టారు. కాపు కట్టుకున్న భక్తులు తొమ్మిది సేద్యపు బావుల్లో తలస్నానం ఆచరించి అమ్మవారి గెరిగను గ్రామాల్లో ఊరేగించారు. మధ్యాహ్నం గ్రామస్తులు అమ్మవారి పూజకు కావలసిన పట్టువస్త్రాలు, వివిధ సుగంధ పుష్పాలు, పూజా సామగ్రిని పంబవాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. వివిధ పుష్పాలతో అమ్మవారిని అలంకరించి పల్లకిలో కన్నికాపురం, రామలింగాపురం, వీర్లగుడి గ్రామాల్లో ఊరేగించారు. ప్రతి ఇంటా మహిళలు అమ్మవారికి కర్పూర హారతులు ఇచ్చి మొక్కుకున్నారు. అమ్మవారి ఊరేగింపులో కోలాట బృందం ప్రదర్శన ఆకట్టుకుంది.



పూజలు అందుకుంటున్న బాటగంగమ్మ తల్లి



అమ్మవారి ఊరేగింపులో కోలాటం వేస్తున్న కళాకారులు

ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై అవగాహన



నాటక ప్రదర్శనలో నాగరాజు కళాబృందం

గంగాధరనెల్లూరు: ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై బుధవారం గంగాధరనెల్లూరు మండల కేంద్రంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నాగరాజు కళాబృందంచే వీధినాటక ప్రదర్శన నిర్వహించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహనలో ప్రధానంగా హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధి ఎలా సంక్రమిస్తుంది ? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై వీధి నాటకం ద్వారా వివరించారు. కళాత్మక ప్రదర్శనతో ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం జిల్లా నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసులు, మెడికల్ ఆఫీసర్ ప్రవీణ్, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కాపుల అభివృద్ధే ధ్యేయంగా పనిచేద్దాం

నగరి: కాపుల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని దానికి మనం ఏకతాటిపై నడచి ఐకమత్యంతో పనిచేయాలని జాతీయ బలిజ సేవా సంఘం ప్రచార కార్యదర్శి గోపిరాయల్ స్పష్టం చేశారు. స్థానిక ప్రైవేటు కల్యాణ మండపంలో బుధవారం నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షులు ఎంవి బాబు ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి కాపు సంఘ సమావేశం నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా కాపు సంఘం అభివృద్ధే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని గోపిరాయల్ పిలుపునిచ్చారు. సేవా కార్యక్రమాలు విరివిగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాపుసంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

జాతరకు పోటెత్తిన భక్త జనం

గంగాధరనెల్లూరు: మండలానికే తలమానికమైన కడపగుంట నడివీధి గంగమ్మ జాతరకు భక్తజనం పోటెత్తారు. అమ్మవారికి కర్పూర హారతులు పట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు అమ్మవారికి అంబలి పోసి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. భక్తులు వినూత్న వేషధారణతో మొక్కులు తీర్చుకున్నారు. నడివీధుల్లో కొలువుదీరిన గంగమ్మ తల్లికి తొలుత వంశపారంపర్య ధర్మకర్తలు విశేష పూజలు చేసి జాతరను ప్రారంభించారు. అనంతరం తోటివారు ఇంటింటికీ వెళ్లి దండోరా వేసి అంబలి తీసుకువచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. బలి చాటింపు తట్టతో గ్రామం మొత్తం తిరిగి సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు పండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



అమ్మవారికి అంబలి తీసుకొస్తున్న భక్తులు



విశేష అలంకరణలో అమ్మవారు